సమ్మెతో నిలిచిన సేవలు

- విధులకు దూరంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు
- మూసి ఉంటున్న కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు



లక్ష్మణచాందలో సమ్మె చేస్తున్న సిబ్బంది



లక్ష్మణచాందలో మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

లక్ష్మణచాంద: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె బాట పట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేవ యడంతో ఏడు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల తోపాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించే ప్రక్రియ నిలిచిపోయింది. 14రోజులుగా సిబ్బంది విధులకు దూరం ఉండటంతో లబ్ధిదారు లు పోషకాహారం అందక ఇబ్బంది పడుతున్నారు. నిర్మల్ జిల్లాలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పలు చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినా పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదు.

జిల్లా వివరాలివీ..

నిర్మల్ జిల్లాలోని నాలుగు(భైంసా, ఖానాపూర్, ముధోల్, నిర్మల్) ప్రాజెక్టుల పరిధిలో 37 సెక్టార్లు ఉన్నాయి. ఇందులో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 816, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 110 ఉన్నాయి. ఈ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 6,014 మంది

ప్రాజెక్టు పేరు	'ప్రధాన' టీచర్లు	'మినీ' టీచర్లు	హెల్పర్లు
భైంసా	175	18	157
ఖానాపూర్	194	37	183
ముధోల్	154	18	125
నిర్మల్	252	26	205

గర్భిణులు, 5,155 మంది బాలింతలు, 59129 మంది చిన్నారులు నమోదై ఉన్నారు.

అందని పోషకాహారం..

కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య తోపాటు గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా పోషకాహారం అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా నివేదికలు తయారు చేస్తారు. కానీ గత 14రోజులుగా జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెలో ఉండటంతో లబ్ధిదారులకు ఈ సేవలేవి అందడం లేదు.

అసంపూర్తిగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

జిల్లాలోని పలుచోట్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీవోఏల సాయంతో లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేసే చర్యలు చేపట్టారు.. కానీ వీవోఏలు సైతం విధులు నిర్వర్తించేందుకు ముందుకు రావడం లేదు. దీంతో అసంపూర్తిగానే పోష కాహారం పంపిణీ ప్రక్రియ సాగుతోంది. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో పలు రకాల సేవలు నిలిచిపోతున్నాయి. ఐదేళ్లలోపు చిన్నారులకు పోషకాహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్య అందడం లేదు. గర్భిణులు, బాలింతలకు పాలు, కోడిగుడ్లు పంపిణీ చేయడం లేదు. వైద్యసిబ్బంది శిబిరాలు నిర్వహించకపోవడంతో గర్భిణులు, బాలింతలకు పలు రకాల వైద్య సేవలు అందడం లేదు.

పోషకాహారం దూరం



కొద్దిరోజులుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె చేస్తుండటంతో కేంద్రాలు మూసి ఉంటున్నా యి. దీంతో మాకు 14 రోజులుగా పోషకాహారం, వైద్యసేవలు అందడం లేదు. తమకు పోషకాహారం అందేలా చూడాలి.

– పద్మ, గర్భిణి, బోరిగాం, మం.లక్ష్మణచాంద

సమస్యలు పరిష్కరించాలి



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 14 రోజులుగా సమ్మె చేస్తున్నాం. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కుటుంబపోషణకు మేం కూడా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లు నెరవేర్చాలి.

– భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, బోరిగాం, మం. లక్ష్మణచాంద

పలు చోట్ల పంపిణీ చేయిస్తున్నాం

సమ్మె కారణంగా కొంత ఇబ్బంది అవుతుంది. నిర్మల్ అర్బన్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ల చేత కోడిగుడ్లు పంపిణీ చేయిస్తున్నాం. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాల్లో ఐకేపీ వీవోఏల చేత కోడిగుడ్లు, పాలు, పప్పు, నూనె లబ్ధిదారులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశాం.

– నాగమణి, సీడీపీవో

ఉత్సాహంగా గణేశుడి నిమజ్జనం



తానూరు : ఝరి(బి)లో నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు

తానూరు/భైంసారూరల్/కుంటాల/లోకేశ్వరం : జిల్లాలో పలు చోట్ల ఆదివారం గణేశుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఏడు రోజులుగా పూజలందుకున్న గణనాథుడికి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. యువత నృత్యాలతో గణనాథుడిని సాగనంపారు. అనంతరం శివార్లలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించగా నిర్వాహకులు, గ్రామపెద్దలు శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు మండపాల వద్ద అన్నదానం చేశారు. తానూరు మండలంలోని ఝరి(బి), బోల్సా గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. భైంసా మండలంలోని కుంసర, చుచుంద్, మిర్జాపూర్, సిద్దూర్, చింతల్‌బోరి గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం నిర్వహించారు. కుంటాల మండలంలోని అంబకంటి, అందాకూర్, మెదన్‌పూర్, సూర్యాపూర్ గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం నిర్వహించారు. సర్పంచులు ప్రదీప్ కుమార్, బక్కి సునీత, దాసరి కిషన్, చంద్రకాంత్ పటేల్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గంగాసాగర్ పాల్గొన్నారు. లోకేశ్వరం మండలంలోని వట్టోలి, కన్కపూర్, పుస్పూర్, సాథ్గాం గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించారు.

కుభీర్: మండలంలోని సిర్పెల్లి (దుర్గానాయక్ తండా)లో ఆదివారం గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. రాథోడ్ పరివార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎంపీటీసీ శ్యాంరావ్, మాజీ సర్పంచ్ బిక్కు, ఉత్తమ్, రమేశ్ తదితరులు ఉన్నారు.



కుంటాల: అంబకంటిలో తరలిస్తున్న గ్రామస్తులు



లోకేశ్వరం: కన్కపూర్‌లో గణేశుడి శోభాయాత్ర



కుభీర్: వేడుకల్లో పాల్గొన్న మహిళలు

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రయ్య, ఐలమ్మ ఉత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట పోశెట్టి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. సర్పంచ్ బోజవ్వ, ఎంపీటీసీ సభ్యురాలు సౌజన్య, ఉపసర్పంచ్ శిరీష, రజక సంఘం నాయకులు సంపత్, శంకర్, సహదేవ్, రాజేశ్వర్, లింగారెడ్డి, రాజేశ్వర్, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మరమ్మతులు చేయించరూ..



సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ నుంచి గాంధీనగర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

పామును పట్టిన కాపరి

ఖానాపూర్: ఇంటి ఆవరణలోకి వచ్చిన నాగుపామును పశువుల కాపరి పట్టుకుని అడవిలో వదిలిపెట్టాడు. మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన పన్నెల లక్ష్మణ్ ఇల్లు పంటపొలాల పక్కనే ఉంది. ఆదివారం చీకటి పడ్డాక ఇంటి ఆవరణలోకి అతిపెద్ద నాగుపాము వచ్చింది. గమనించిన లక్ష్మణ్ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట్ గ్రామానికి చెందిన సీనయ్య అనే పశువుల కాపరికి సమాచారం ఇచ్చాడు. అతడు మస్కాపూర్ గ్రామానికి చేరుకుని పామును పట్టి అడవిలో వదిలోపెట్టాడు.

కుటుంబానికి పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని భైంసా భూమాగౌడ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావ్ పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వారి వెంట భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, భూమాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అసంవాడ్ గంగాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు!

- చనిపోయిన వ్యక్తి పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు



దస్తురాబాద్ గ్రామసభలో మాట్లాడుతున్న బృందం

దస్తురాబాద్: మండలంలోని దస్తురాబాద్, రేవో జీపేట్‌లో ఆదివారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ అధికారులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు రికార్డులు పరిశీలించి పనుల వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు మండలంలోని 13పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి పనుల వివరాలు, జరిగిన అవకతవకలను గుర్తించారు. ఈనెల 26న మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించి.. పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

వెలుగులోకి అక్రమాలు..

మండలంలోని 13 గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ గ్రామసభల్లో పలు అక్రమాలు గుర్తించారు. మున్యాల పంచాయతీలోని పెద్దూర్ గ్రామానికి చెందిన తలారి రాజలింగం చనిపోయినా.. అతడికి 82 రోజులు పని కల్పించి, రూ.20,090 చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. బుట్టాపూర్ పంచాయతీలో జాబ్‌కార్డు కోసం రూ.800 వసూలు చేశారని ఓ వ్యక్తి గ్రామసభలో వెల్లడించారు. భూత్కూర్‌లో నిర్వహించిన గ్రామసభకు పంచాయతీ కార్యదర్శి హాజరుకాలేదు.అధికారుల ఒత్తిడి మేరకు వరికల్లాలు నిర్మించుకున్నామని.. కానీ బిల్లులు రాలేదని దస్తురాబాద్‌కు చెందిన ఆరుగురు రైతులు గ్రామసభలో ఆవేదన వ్యక్తం చేశారు.

సీసీ రోడ్లపై జరగని తనిఖీ..

ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించింది. తమకు రికార్డులు ఇవ్వకపోవడంతో తనిఖీ చేయలేదని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు.

వినాయకుడికి పూజలు



తానూరు: భోసిలో దర్శనానికి వచ్చిన భక్తులు



శ్రీనగర్‌లో కుంకుమార్చనలో మహిళలు

తానూరు: తమ గండాలను తొలగించాలని విఘ్నేశ్వరుడికి భక్తులు ఘనంగా పూజలు చేస్తున్నారు. మండలంలోని భోసిలో నెలకొల్పిన కర్రవినాయకుడిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. మహారాష్ట్రలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం జనసంద్రంగా మారింది. భక్తులు ప్రత్యేక వాహనాల్లో చేరుకొని.. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షులు మురళి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని భాగ్యనగర్, విజేత టవర్స్, ప్రియదర్శినినగర్, సాగర్ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని విజేత టవర్స్ వాసులు చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. కూన రమేశ్, శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, వంశీధర్, మహేశ్, ఆనంద్, రఘు తదితరులు ఉన్నారు.

శ్రీనగర్‌లో ఘనంగా కుంకుమార్చన

జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ఆదివారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని అలంకరించి.. ప్రత్యేక పూజలు చేశారు. లలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరాలు, గణపతి గౌరీపూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనగర్ గణేశ్ మండలి ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా 'కరెన్సీ' గణపతి



ఖానాపూర్: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ ప్రతిమను కరెన్సీ నోట్లతో ముస్తాబు చేశారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు గణపయ్యను రూ.11,11,111 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. కరెన్సీ గణనాథుడిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



నిర్మల్‌లో ఉద్యోగులను సన్మానించిన సభ్యులు



దశరథ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉద్యోగ, ఉపాధ్యాయ అవార్డులు పొందినవారితోపాటు క్రమబద్ధీకరించిన పంచాయతీ కార్యదర్శులను కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం (కేవా) జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీయూ భవన్‌లో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు పొందిన ఆరేపల్లి రాజేంద్రప్రసాద్, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన తొడిశెట్టి చంద్రయ్య, మధు సిలారి, ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగి తొడిశెట్టి లింగయ్య, క్రమబద్ధీకరించిన పంచాయతీ కార్యదర్శులు పోతుగంటి వెంకటేశ్, ముదారపు శైలజ, ఐలాపురం నాగరాజు, మోహన్‌ను శాలువా, పూలమాల, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు ఆరెపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సాయన్న, ఆర్థిక కార్యదర్శి చిలివేరి అశోక్, గౌరవ అధ్యక్షులు పోతుగంటి లక్ష్మణ్, గౌరవ సలహా సభ్యులు తొడిశెట్టి పరమేశ్వర్, రవికాంత్, మారుపాక శ్రీనివాస్, తాళ్లపల్లి నారాయణ, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం పొందిన కడారి దశరథ్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక శ్రీ గౌతమి హైస్కూల్‌లో ట్రస్మా గౌరవాధ్యక్షుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్, ఇతర ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ రేగుంట రవీందర్, పాటల రచయిత ముజ్గి రవి, గంగుతాయి తదితరులున్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



ముధోల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్



నిర్మల్ డీఎస్పీకి ఏర్పాట్లను వివరిస్తున్న ఈశ్వర్

ముధోల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని రాంటెక్, గన్నోరా, ఎడ్‌బిడ్ గ్రామాల్లో ఆదివారం గణనాథుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో గణేశుడి నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పరిశీలించారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.

అంగన్‌వాడీల నిరసన

కుంటాల: తన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరుకుంది. కుంటాలలో ఆదివారం టీచర్లు, సిబ్బంది నలుపు రంగు చీరలు ధరించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నేడు ఇళ్ల పట్టాలు పంపిణీ

తానూరు: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేస్తారని తహసీల్దార్ లింగంమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు క్విజ్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో ఈనెల 25న గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రామాయణం, మహాభారతం వినాయక చవితి ప్రాధాన్యత, హనుమాన్ చాలీసాపై నిర్వహించే పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

'కాంగ్రెస్ గెలుపు ఖాయం'



సతీశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దస్తురాబాద్: వచ్చే ఎన్నికల్లో అధిక సీట్లు సాధించి.. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సతీశ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మండలాధ్యక్షుడు రమేశ్, నరేశ్, రహీం, గోవర్ధన్, లచ్చన్న, శ్రీనివాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత



గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఆదివారం 22,356 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ అధికారులు రెండు వరద గేట్లు ఎత్తి 23,189 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 699.425 (7.467టీఎంసీ) అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

జాన్సన్ నాయక్‌ను కలిసిన నాయకులు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామ నాయకులు ఆదివారం ఖానాపూర్‌లోని తన నివాసంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్‌ను కలిశారు. గణేశ్ నిమజ్జన వేడుకలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో లచ్చన్న, రవి, సత్తెన్న, గణేశ్, వేణుగోపాల్, వంశీ, మధు, రాజ్‌కుమార్, లక్ష్మణ్, విజయ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో పూజలు

కుంటాల: సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని నిజామాబాద్ జిల్లా నవీపేట్ అయ్యప్ప ఆలయ ప్రధాన అర్చకుడు శశాంక్ జోషి అన్నారు.ఆదివారం కుంటాలలోని ఇలవేల్పు గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో పూజలు చేశారు. ఎస్సై హన్మాండ్లు, గురుస్వామి జక్కని గజేందర్, ఆలయ కమిటీ సభ్యులు జుట్టు సుధాకర్, హరిప్రసాద్, చిప్ప సంజీవ్, గంగయ్య, రాంచందర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



వీడీసీ కార్యవర్గం

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొండాడి జగ్గారావు, అధ్యక్షుడిగా సబ్బావేని నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా బుర్ర రాజరమేశ్‌గౌడ్, కోశాధికారిగా మందపల్లి రమేశ్, కార్యనిర్వాహకుడిగా సుజీత్‌రావు, ప్రవీణ్, దేవేందర్, గంగారాజం తదితరులు ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

కుంటాల: కుంటాలకు చెందిన ప్యాదరి దేవకి–గజ్జారాంల కుమారుడు అరవింద్ ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు ప్యాదరి భూమన్న, భోజారాం, రమేశ్, గజేందర్, చిన్నన్న, భూమన్న, శ్రీనివాస్, శ్రీకాంత్, పోతన్న, గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.